
సాక్షి
ప్రకాశం
మంగళవారం। 1। ఏప్రిల్। 2025



కొమరోలులో కారు బీభత్సం

మద్యం మత్తులో ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి కొమరోలు పట్టణంలో రాష్ట్రీయ రహదారిపై జరిగింది. - 8లో..



గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

జిల్లాలో ఆదివారం రెండు చోట్ల గుర్తుతెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. ఉప్పుగుండూరు హైస్కూల్ సమీపంలో ఒకటి, నరసాయపాలెం సమీపంలో ఒక మృతదేహాన్ని గుర్తించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
41/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 17 కరువు మండలాలు

- 11 మండల్లాలో తీవ్రమైన కరువు
- 6 మండలాల్లో పాక్షిక కరువు

ఒంగోలు సిటీ: జిల్లాలో 17 కరువు ప్రభావిత మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిసోడియా తెలిపారు. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా పరిధిలోని 17 మండలాల్లో 11 మండలాల్లో తీవ్రమైన కరువు, 6 మండలాల్లో పాక్షిక కరువు ఉన్నట్లు చెప్పారు. పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారిపేట మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, చంద్రశేఖరపురం, పామూరు, రాచర్ల మండలాల్లో పాక్షిక కరువు ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు.

2న ఫ్యాప్టో నిరసన

- సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ఆందోళన

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కే ఎర్రయ్య కోరారు. ఆమేరకు ఉపాధ్యాయులతో సోమవారం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా జిల్లా ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ ఎస్ఎండీ రఫీ వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. 30 శాతం ఐఆర్ మంజూరు చేయడం, మిగిలి ఉన్న ఆర్థిక బకాయిలు జెడ్పీ పీఎఫ్ లోన్స్, ఏపీజీఎల్ఐ క్లోజర్స్, సరెండర్ లీవ్స్ విడుదల చేయడం, సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం, కారుణ్య నియమకాలు వెంటనే పూర్తి చేయడం, 2003 డీఎస్సీ వారికి ఓల్డ్ పెన్షన్ స్కీం వర్తింపచేయటం వంటి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు వీ మాధవరావు, డీ జయరావు, జీఎమ్‌డీ సనావుల్లా, ఎస్.కె అబ్దుల్ హై, వీ జనార్దన్ రెడ్డి, బీ వెంకట్రావు, వై వెంకట్రావు, సభ్యులు ఎస్ రవి, డీ శ్రీనివాసులు, మర్రి శ్రీనివాసులు, పర్రె వెంకట్రావు, బి అశోక్ కుమార్, చల్లా శ్రీనివాసులు, ఎస్కే అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న మతపెద్ద



ఈద్గా వద్ద నమాజులో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చుండూరి రవిబాబు



ప్రత్యేక ప్రార్థనల్లో చిన్నారులు

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ

- ఒంగోలు ఈద్గాలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రార్థనలు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని ముస్లింలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన మంచినీరు, మజ్జిగ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈద్గా వద్ద నమాజులో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలను ముస్లింలకు అందజేశారన్నారు. రాజకీయంగా కూడా ఎంతో ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాగూర్, దాసరి కరుణాకర్, మల్లెల భాస్కర్ రెడ్డి, మైనారిటీ నాయకులు ఉన్నారు.

కార్డుదారులు.. కందిపోతూ..!



ముచ్చటగా మూడో నెలా రేషన్‌కార్డుపై ఇచ్చే కందిపప్పును నిలిపివేసింది కూటమి ప్రభుత్వం. బహిరంగ మార్కెట్లో కందిపప్పు రేటు ఎక్కువగా ఉండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు రేషన్ దుకాణాల్లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తారు. మార్చి నెలలో ప్రధాన పండుగలు ఉగాది, రంజాన్‌లు ఉన్నా కార్డుదారులకు కందిపప్పు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.



- రేషన్ దుకాణాల్లో ముచ్చటగా మూడో నెలా కందిపప్పు నిలిపివేత
- బియ్యం, పంచదారకే పరిమితం
- జిల్లా వ్యాప్తంగా 655 టన్నుల పప్పు అవసరం
- ఉగాది, రంజాన్ పండుగల నెలలో ఇవ్వకపోవడంపై కార్డుదారుల ఆగ్రహం

సింగరాయకొండ: జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఈ నెలా కందిపప్పు అందనంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పండుగ తోఫాలు ఇస్తాం.. కందిపప్పు ఇస్తాం అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన ఆ పార్టీ పెద్దలు అధికారంలోకి వచ్చాక అన్నీ కోతలే పెడుతున్నారు. జిల్లాలో మూడు నెలలుగా రేషన్‌కార్డులపై కందిపప్పు పంపిణీ పూర్తిగా నిలిపి వేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలు 1,392, రేషన్‌కార్డుదారులు 6,76,160 ఉండగా నెలకు సుమారు 655 టన్నులు అవసరం. బయట మార్కెట్లో మొన్నటి వరకు కిలో కందిపప్పు రూ.180 ఉండగా నేడు కిలో రూ.130 విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రేషన్‌కార్డుపై కిలో రూ.67 కు అందిస్తూ వస్తోంది. దీంతో కార్డుదారులు ప్రతినెలా బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు కూడా తీసుకునేవారు. జనవరిలో పాక్షికంగా కార్డులపై కందిపప్పు పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి, మార్చి, నెలలో పూర్తిగా నిలిపేసింది. ఈ నెల కూడా గోదాములకు సరుకు రాకపోవడంతో పంపిణీ ఉండదని తెలిసింది. మార్చి నెలాఖరులో వచ్చిన ఉగాది, రంజాన్ పండుగలకు పప్పన్నం తినాలన్న ఆశలు అడియాశలయ్యాయి. పేద ప్రజలకు బయట మార్కెట్లో అధిక ధరలకు కందిపప్పు కొనలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ రెండు పండుగలు ఆయా సామాజికవర్గానికి చెందిన ప్రజలు మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం వస్తుంది మీ కష్టాలు తీరుస్తుంది అని ఊదర కొట్టిన పాలకులు అధికారులకు పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకపోగా, చివరికి కందిపప్పు కూడా కార్డులపై పంపిణీ చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం పంపిణీలో కూడా పాక్షికమే?

ఈ గోడౌన్ నుంచి రేషన్ బియ్యం పంపిణీలో కూడా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జరుగుమల్లి, పొన్నలూరు, కొండపి, టంగుటూరు మండలాల్లోని రేషన్‌షాపులకు రేషన్ బియ్యం నూరు శాతం పంపిణీ కావాల్సి ఉండగా కేవలం 30 శాతం మాత్రమే దుకాణాలకు పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్దినెలలుగా ఇదే తంతు నడుస్తోందని, మిగిలిన బియ్యం నేరుగా రైసుమిల్లుకు సరఫరా చేస్తున్నారని అధికార పార్టీ నాయకులే ఆరోపించడం గమనార్హం. వాస్తవానికి ప్రతి రేషన్‌షాపునకు ఎన్ని కార్డులు ఉంటాయో ఆ ప్రకారం రేషన్ బియ్యం సరఫరా కావాల్సి ఉంది. అయితే ప్రతినెలా రేషన్ దుకాణదారుడు కార్డుదారుల నుంచి కొనుగోలు చేయటం ఆ బియ్యాన్ని రైస్‌మిల్లుకు సరఫరా చేయటం.. ఈ తంతు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి పార్టీల పెద్దల కనుసన్నల్లోనే బియ్యం అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది పెద్దలు అధికారుల వద్దే ఏయే రేషన్ దుకాణానికి ఎంత సరఫరా అవుతోంది..ప్రతి నెలా క్రమం తప్పకుండా ఎంత మంది తీసుకుంటున్నారు.. ఎంత మిగులుతుంది అన్న ఆరా తీసుకుని, ఆ ప్రకారం ముందుగానే ఎంత బియ్యం వస్తుందో తెలుసుకుని బేరసారాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఈ వ్యవహారంలో భారీ ఎత్తున నగదు చేతులు మారుతోందని, జిల్లా స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీల పేరుతో అప్పుడప్పుడూ వచ్చి హడావుడి చేసి వెళ్తున్నారే తప్ప చర్యలు శూన్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పెద్దపులి కలకలం



పొలాల్లో గుర్తించిన పెద్ద పులి కాలి ముద్రలు



గంజివారిపల్లెలో గస్తీ తిరుగుతున్న ఫారెస్ట్ సిబ్బంది

- గంజివారిపల్లె పొలాల్లో పులి సంచారంతో రైతుల ఆందోళన

యర్రగొండపాలెం: మండలంలోని గంజివారిపల్లె పొలాల్లో పెద్దపులి సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి పొలాల్లో పెద్దపులి సంచరిస్తుందన్న విషయాన్ని ఆ గ్రామ రైతులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. పులి సంచరించే ప్రాంతాలను అధికారులు గుర్తించి ఆయా ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు బిగించారు. ఆ కెమెరాల్లో పులి కదలికలు రికార్డయ్యాయి. గంజివారిపల్లె, కొలుకుల, జంగంవారిపల్లె అటవీ ప్రాంతాల్లో పెద్దపులి తిరుగుతున్నట్లు గుర్తించిన వారు ఆయా ప్రాంతాల్లో అడవి పందులను వేటాడే క్రమంలో గంజివారిపల్లె సమీప పొలాల్లోకి పులి వచ్చి ఉంటుందన్న అనుమానాన్ని ఫారెస్ట్ అధికారులు వ్యక్తం చేశారు. ఇటీవల అటవీ ప్రాంతంలోకి మేత కోసం వెళ్లిన పశువుపై పులి దాడి చేసి చంపేయడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పెద్దపులి సంచరిస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అది పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు రైతులకు ధైర్యం చెప్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పొలాలు గ్రామాల్లో ఫారెస్ట్ సిబ్బంది గస్తీ తిరుగుతూ పులి కదలికలపై నిఘా ఉంచారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో ర్యాలీ



వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పాత మార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఒంగోలు టౌన్: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వివిధ మసీదుకు చెందిన ముస్లింలు నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయా మసీదులలో పండుగ నమాజు అనంతరం ర్యాలీగా బయలుదేరిన ముస్లింలు పాత కూరగాయల మార్కెట్ సమీపంలోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన వైఖరిని ప్రకటించాలని, ముస్లింల రాజ్యాంగ హక్కులను కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులకు రక్షణ కల్పించేలా బిల్లులో సవరణలు తీసుకొని రావడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సమర్థనీయం కాదని చెప్పారు. ముస్లింలను ఇబ్బందులకు గురిచేసేందుకు బీజేపీ నేతృత్వంలోని కూటమి పాలకులు చేస్తున్న దుష్ట ప్రయత్నాలను న్యాయపోరాటాల ద్వారా తిప్పి కొడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు. నిరసనలో ముస్లిం నాయకులు ఎస్డీ సర్దార్, న్యాయవాది కరీముల్లా, అబ్దుల్ రవూఫ్, సయ్యద్ ఇస్మాయిల్, పి.కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

3వ తేదీ నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

ఒంగోలు సిటీ: ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ఒంగోలులోని డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ స్పాట్ వాల్యుయేషన్‌లో మొత్తం 150 గ్రూప్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో 150 మంది సీఈలు, 600 మంది ఏఈలు, 300 మంది స్పెషల్ అసిస్టెంట్స్‌ను తీసుకున్నట్లు చెప్పారు. గ్రూప్ అంటే ఒక సీఈ, ఆరుగురు ఏఈలు, ఇద్దరు స్పెషలిస్ట్ ఉంటారన్నారు. స్పాట్ వాల్యుయేషన్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. జిల్లాకు మొత్తం 1.90 లక్షల పేపర్లు కేటాయించారన్నారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్‌కు కేటాయించిన ఉపాధ్యాయులని రిలీవ్ చేయాల్సిందిగా డీడీఓలను ఆదేశించామన్నారు.

హాజరు కాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపాస్ ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ ఏబీఎం జూనియర్ కాలేజీలో ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు.

వైవీ మాతృమూర్తికి ఘన నివాళి



వై పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ఒంగోలు సిటీ:

రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఉత్తర క్రియలు సోమవారం నిర్వహించారు. ఒంగోలు వీఐపీ రోడ్డులో ఆయన స్వగృహంలో ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వైవీ సుబ్బారెడ్డి, ఆయన సోదరులు భద్రారెడ్డి. హనుమారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపీలు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పిచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్ విజయమ్మ, వైఎస్ అనిల్ రెడ్డి, వైఎస్ సునీల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఎంపీలు గురుమూర్తి, తనూజారాణి, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, కురసాల కన్నబాబు, శంకర్‌నారాయణ, నారాయణస్వామి, చెల్లుబోయిన వేణుగోపాల్, తానేటి వనిత, అనిల్ కుమార్ యాదవ్, తోట నరసింహులు, మాజీ ఎంపీలు మార్గాని భరత్, కరణం బలరాం, ఎమ్మెల్యేలు ఉప్పాల శ్రీనివాస్, తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు అనంతబాబు, కొరు శ్రీనివాస్, మేరుగు మురళి, పాలవలస విక్రాంత్, మొండితోక అరుణ్, తూమాటి మాధవరావు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, టీజేఆర్.సుధాకర్‌బాబు, కదిరి బాబూరావు, రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కరణం ధర్మశ్రీ,, కురుముట్ల శ్రీనివాస్, బూడి ముత్యాల నాయుడు, గొడ్డేటి మాధవి, నంబూరి శంకరరావు, గొట్టుగల్ల భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీనివాస్ నాయుడు, తలారి వెంకట్రావు, ప్రతాప్‌రెడ్డి, అదీప్ రాజ్, రెడ్డి శాంతి, పెట్ల ఉమాశంకర్ గణేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి మురళి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు చుండూరు రవిబాబు, కరణం వెంకటేష్ బాబు, దద్దాల నారాయణ యాదవ్, వరికూటి అశోక్‌బాబు, గాదె మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వరికూటి అమృతపాణి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్యే బీఎస్ విజయ్‌కుమార్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, వై వెంకటేశ్వర్లు, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైవీ భద్రారెడ్డి



వై పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైవీ విక్రాంత్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, నారాయణ స్వామి, కొరుముట్ల శ్రీనివాస్ తదితరులు



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు తోట నరసింహులు, కురసాల కన్నబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సింగరాయకొండలో ఖురాన్ సారాంశాన్ని వివరిస్తున్న మతపెద్ద



దొనకొండ: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఒంగోలులో ఈద్ ముబారక్ చెప్పుకొంటున్న చిన్నారులు

అల్లాహ్ చూపిన మార్గం..

సమభావం.. సహకారం

నెల రోజుల కఠోర ఉపవాస దీక్షను ఆచరించిన ముస్లింలు రంజాన్(ఈద్ ఉల్ ఫిత్ర్) వేడుకలను సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, ముక్కు పుటాలు గుభాళించే అత్తరు చల్లుకుని, కళ్లకు సుర్మా పెట్టుకుని మసీదులకు చేరుకున్న ముస్లింలు.. తదనంతరం తక్బీర్ పఠిస్తూ ఈద్గాల వద్దకు ర్యాలీగా బయలుదేరారు. పూర్వీకుల సమాధులపై పూలు చల్లి ప్రార్థనలు చేశారు. సామూహిక నమాజ్ ఆచరించి, పరస్పర ఆలింగనాలతో రంజాన్ ముబారక్ చెప్పుకొన్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథంలో అల్లాహ్ పేర్కొన్న సూక్తుల సారాంశాన్ని ముస్లిం మత పెద్దలు వివరించారు. ముస్లింలు మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడుస్తూ.. సమాజంలో సమభావం నెలకొల్పేందుకు, పేదలు సంతోషంగా జీవించేందుకు సహకారం అందించాలని ఉద్బోధించారు. రంజాన్ సందర్భంగా జిల్లాలో మత సామరస్యం వెల్లివిరిసింది.

- సాక్షి నెట్‌వర్క్





ఒంగోలు: ఈద్గా వద్ద అత్తరు, టోపీలు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తూ..



కంటికి సుర్మా పెట్టించుకుంటున్న యువకులు



పొదిలిలో ఈద్గా మైదానం వద్ద నమాజ్



ఒంగోలులో నమాజ్‌కు భారీగా హాజరైన ముస్లింలు



ఒంగోలులో తక్బీర్ పఠిస్తూ ఈద్గా వద్దకు తరలివస్తున్న ముస్లింలు



పెద్ద దోర్నాలలో ముస్లింల సామూహిక ప్రార్థన



కంభంలో ఈద్గా వద్దకు చేరుకుంటున్న ముస్లింలు



పామూరులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

కొమరోలులో కారు బీభత్సం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో 2 గంటలు నిలిచిన సరఫరా
- పోలీసుల అదుపులో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి

కొమరోలు: మద్యం మత్తులో ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. ఆదివారం అర్ధరాత్రి కొమరోలు పట్టణంలోని అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కారును వేగంగా నడుపుతూ రోడ్డు పక్కనే ఉన్న దుకాణాల బోర్డులను, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. స్తంభం విరిగిపోవడంతో అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నాగరాజు.. మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదం కారణంగా కొమరోలులో దాదాపు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

మోటూరి స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాటం



మోటూరి ఉదయంకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు టౌన్: ఏపీలో మొట్టమొదటి మహిళా మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేసి తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకూ పోరాడిన మోటూరి ఉదయం స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. మోటూరి ఉదయం 23వ వర్ధంతిని స్థానిక ఎల్బీజీ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితమైన కాలంలోనే మోటూరి ఉదయం స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాన్ని స్థాపించడంలో కీలకపాత్ర పోషించిన ఆమె.. స్త్రీ, పురుష సమానత్వం కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఉదయం స్ఫూర్తితో మహిళల కోసం ఒంగోలులో ఉచిత న్యాయ సలహా కేంద్రం నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా నాయకురాలు జి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె మనవరాలైన డా.ఉదయిని సహకారంతో బేతూన్ నర్సింగ్ హోంలో ప్రతి నెలా మూడో శుక్రవారం ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉదయం ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.పెద్ద గోవిందమ్మ, ఎస్.మాలతి, కె.రాజేశ్వరి, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ

కొత్తపట్నం: పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరదలిచిన విద్యార్థులకు కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో రేపటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.యేసుప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) రిజిస్ట్రేషన్ 2025 మార్చి 12 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 15వ తేదీ వరకు జరగనుందన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ వంటి వివిధ డిప్లమా ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థుల కోసం పాలిసెట్–2025 (ఎంట్రెన్స్ పరీక్ష)ను ఏప్రిల్ 30వ తేదీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష నిమిత్తం ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లిష్, తెలుగు మాధ్యమంలో అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు వినియోగించుకోవాలని కోరారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పదో తరగతి హాల్ టికెట్, ఫొటో, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9912342071, 8919693460 నంబర్లను సంప్రదించాలన్నారు. ఎక్కడైనా ఆన్‌లైన్ సెంటర్‌లోగానీ, నేరుగా హెచ్‌టీటీపీఎస్/పాలిసెట్‌ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లోగానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉత్తమ సేవలతోనే పేరు ప్రఖ్యాతులు



రిటైరైన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, అయితే, ఉద్యోగంలో ఉన్నప్పుడు అందించిన ఉత్తమ సేవలతోనే ఉద్యోగానంతరం కూడా గుర్తుండిపోయేలా పేరు ప్రఖ్యాతులు లభించి ఆత్మసంతృప్తి కలిగిస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జరుగుమల్లి ఏఎస్సై జి.శ్రీనివాసరావు, గిద్దలూరు హెడ్‌కానిస్టేబుల్ కేవీ రమణారెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా వారిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్ప విషయమని, అందరికీ సకాలంలో రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలు అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. రిటైర్‌మెంట్ ద్వారా వచ్చిన డబ్బును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఏదైనా సహాయం కావాలంటే సంప్రదించాలని, పోలీసు శాఖ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం



ఘటన స్థలంలో ఉన్న మృతదేహం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో హైస్కూల్ సమీపంలోని రజకుల క్వారీ కుంటలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కుంటలో మృతదేహం తేలియాడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు తరలించారు. మృతుడి వయసు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, తెల్లగీరల చొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటన స్థలంలో పడి ఉన్న మద్యం, వాటర్ బాటిళ్ల ఆధారంగా.. మద్యం సేవిస్తూ ప్రమాదవశాత్తూ క్వారీ కుంటలో పడి ఉండవచ్చని అంచనా వేశారు. మృతుడికి సంబంధించిన ఎటువంటి ఆధారాలూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హైవే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం



బ్రిడ్జి సమీపంలో పడి ఉన్న గుర్తు తెలియని శవం

యర్రగొండపాలెం: మండలంలోని నరసాయపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వంతెన కింద గుర్తుతెలియని మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు దాదాపు 50 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడి శరీరంపై ఉన్న యూనిఫాంను బట్టి మోటార్ ఫీల్డ్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.



కళ్యాణ క్రతువులో వేద పురోహితులు, దంపతులు

శోభాయమానంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక శర్మ కాలేజీ మైదానంలో సోమవారం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. దేవతామూర్తులకు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నూతలపాటి శివప్రసాద్, వలేటి వీరబ్రహ్మం, గోనుగుంట శివప్రసాద్, కొండపి వెంకటేశ్వర్లు, గిరి, కొల్లాబత్తిన రమేష్‌బాబు, నారాయణశివ, యలమందల సుబ్బారావు, అధిక సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ పర్సనల్, వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీయల్ లకు ఫైనాన్స్ సలహాల కొరకు సంప్రదించండి 9063290864 [SCA-25002411]

Wanted

■ ఒంగోలు లోని శ్రీరత్నశ్రీ మెడికల్ షాప్ నందు వర్క్ చేయుటకు అనుభవం కలిగిన or న్యూ Boys కావలెను. సంప్ర॥ ✆ 99665 81651. [O-190174]

■ పయనీర్ హోండా, ఒంగోలు బ్రాంచ్‌కు వర్క్స్ మేనేజర్ : 1 to 2 Yrs ఎక్స్‌పీరియన్స్, సేల్స్ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్స్ (M/F) రిసెప్షనిస్ట్–2, సూపర్‌వైజర్స్ మరియు చీమకుర్తి బ్రాంచ్‌కు మెకానిక్స్ కావలెను. ✆ 97054 61160, 93980 27849. [OA-395]

■ ఒంగోలు, సింగరాయకొండ, టంగుటూరు PAYTMలో పనిచేయుటకు సేల్స్ ఆఫీసర్ (ఆన్ రోల్) Q:10th, ఇంటర్, నెలకు 30,000/- సంపాదన, బైక్&స్మార్ట్‌ఫోన్‌తప్పనిసరి.✆ 9390506564 [OA-396]

www.sakshi.com

■ ఒంగోలులోని ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు Sr. లెక్చరర్స్ Jr. లెక్చరర్స్, సెక్షన్ ఇన్‌చార్జెస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ ✆ 63995 52222 [OA-253]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002418]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [SCA25002490]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k. ఫోన్: 9640400073, 9160900024 [SCA25002453]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.